# ఫైళ్లు - మనిషి



ఆంగ్ల మూలం: మార్గరెట్ పాల్ జోసెఫ్

తెలుగు అనువాదం: ఎ.వి.రెడ్డిశాస్త్రి

కథ

నా చిన్నతనంలో ఆడపిల్లలకి రెండే రెండు కాలక్షేపాలు వుండేవి- కబుర్లు లేకపోతే చదువు. మరిప్పుడో? అమ్మాయిలు కూడా స్టాక్‌ఎక్స్ఛేంజ్ లావాదేవీల్లో తలమునకలవుతున్నారు.

మా అమ్మాయి కమల్నే తీసుకోండి- ఇరవై తొమ్మిదేళ్ల వయస్సులో ఆమె చెయ్యవలసిన మొదటిపని తనదంటూ ఓ కుటుంబాన్ని ఏర్పాటుచేస్కోడం. కాని ఆమె చేస్తున్న పనల్లా ఆర్థిక పరమైన లావాదేవీల గురించి చదువుతూ వుండడం (మేష్టరుగా పాఠాలు చెప్పడంతోపాటు) ఎద్దుల గురించీ, ఎలుగుల గురించీ చర్చిస్తుండడం; నేను తరచు అనుకుంటుంటాను మా అమ్మాయి పళ్లు, కూరగాయలు కొనుక్కోడం, చిత్తుకాగితాల్ని, పాతపేపర్లనీ అమ్ముకోడంలాంటి స్త్రీ సహజమైన వ్యావృత్తుల్లో మునిగివుంటే ఎంత బాగుండేదీ అని. అలాకాకుండా షేర్లని అమ్మడం, కొనడం చేస్తోంది ఆమె. షేర్లలో పెద్దగా మదుపులు పెట్టొద్దని కొన్నాళ్ల క్రితం నేనామెకు సలహా యిచ్చేను. ఇన్ని సంవత్సరాల అనుభవం వుండి కూడా నేనే తప్పులు చేస్తున్నాను కదా, మరి మా అమ్మాయి తప్పులు చెయ్యకుండా ఎలా నెగ్గుకొచ్చేస్తుందట? నా సలహా విని నవ్వేసి, పేపర్లోని బిజినెస్ కాలమ్ పట్టుకొని వంటింట్లోకి వెళ్లిపోయింది. నా సహ ఉద్యోగస్తుల్లా నేను కూడా ఏదో కాస్త కూడబెట్టగలిగివుంటే, ఆమెకి పెళ్లి చేసేసి వుండేవాడ్ని. దాంతో యీరకమైన తిక్కలు ఏవీ లేకుండాపోయేవి. కాని విధి నాకు వ్యతిరేకంగా వుంది.

ఇలా ఎందుకంటున్నానంటే- నేనన్నిట్నీ పద్ధతి ప్రకారం చేస్కొచ్చే రకం. పద్ధతి లేని దగ్గర నేను లేనట్లే లెక్క. మరి యిన్ని సంవత్సరాల గవర్నమెంట్ సర్వీస్ చేసింతర్వాత, ఓ పద్ధతి ప్రకారం పోవటం అన్నది ఎలా అలవాటుకాకుండా వుంటుంది చెప్పండి! మంచి తండ్రికి వుండవలసిన లక్షణాలన్నీ వున్నాయి నాకు. పద్ధతి, కార్యదక్షతలు రెండిట్నీ ఒకచోట చేర్చండి- ఆ రెండు లక్షణాలు వున్న తండ్రి తన పిల్లలు చక్కటిపద్ధతిలో బతికేటట్టు చెయ్యగలుగుతాడు.

కమలకి పంథొమ్మిదో ఏడు వచ్చిన్నాటి నుండి యోగ్యుడైన కుర్రాళ్లని వెతుకుతూనే వున్నాను. కొన్ని మంచి సంబంధాల ఫైలు" అని టైటిల్ ఊడా రాసేను. అందులో ఒక్కొక్క పేజీ ఒక్కొక్క పెళ్లికొడుక్కి కేటాయించేను. (ప్రతి కేసు వివరాల్ని మూడు సెట్లుగా భద్రపరిచేవాడ్నని వేరేగా చెప్పనక్కర్లేదు.) ఫైలు ఆఖరి పేజీలో విషయసూచిక తయారు చేసేను. అందులో వివరాలు యిలావుండేవి: అలగేశన్, గిరీష్, కృష్ణన్, శంకర్- యిలా (ఆల్ఫాబెటికల్ ఆర్డరులో) ప్రతి పేజీకి నెంబరు వేసేవాడ్ని. ఉదాహరణకి మూడోనంబరు పేజీ క్రిష్ణన్ గురించిన వివరాలను యిచ్చేది. ఆ కుర్రాడి కుటుంబ చరిత్ర, ఎవరెవరితో వాళ్లకి బంధుత్వాలున్నాయో, తండ్రిని గురించి వివరాలు, జీతాల వివరాలు, కుటుంబంలో వున్న పిల్లల సంఖ్య, ఎంతమందికి పెళ్లిళ్లు అయినాయో, యింకా ఎంతమందికి అవాలో, ఆస్తిపాస్తుల వివరాలు, కుర్రాడి ఆకారం, చదువు, ఉద్యోగావకాశాలు, రాబోయే జీతం, వాడి నడవడిక ముఖ్యంగా (అయితే యీ విషయంలో ఖచ్చితమైన భోగట్టా లభించదు- ఎంచేతనంటే కాబోయే పెళ్లికొడుకులంతా సత్ప్రవర్తన కలిగివున్నవాళ్ల కిందే లెక్క.)

కమల పెళ్లి విషయంలో నేను యిలా ఫైలుని ప్రారంభించగానే నన్ను మెచ్చుకోలుగా చూసింది నా భార్య. నా పని దక్షతని చూసి ఆమె చాలా ఆనందించింది. రోజులు గడుస్తున్నకొద్దీ ఫైలు దళసరి పెరుగుతుండడం చూసి బాగా గర్వపడింది. అయితే, యివన్నీ పదేళ్ల క్రిందటి భోగట్టాలు. ఇప్పటికీ కమలకింకా పెళ్లికాలేదు. బీరువా లాకర్‌లో ఆ ఫైలు అలా వుండనేవుంది. ఏ పెళ్లి సంబంధం కుదరకపోవడంతో, పెళ్లి సంబంధాల గురించి మాట్లాడ్డం బాగా తగ్గించేసింది కమల. అంతటితో వూరుకోకుండా- కమల నిష్ఠూరంగా మాట్లాడ్డం మొదలెట్టింది. లాకర్లో యీ ఫైలు దాచడానికి బదులుగా, మరికొన్నిట్ని దాచివుంటే తన పెళ్లియేనాడో అయిపోయివుండేదట!

ఆమెకి నేను సమాధానం చెప్పదల్చుకోలేదు. ఈ రోజుల్లో ఆడపిల్లలు బాగా తెలివిమీరేరు- అది అందరికీ తెలిసిన సంగతే. ఆశ్చర్యం ఏమిటంటే, యీ మధ్యని నా భార్య కూడా యీతరం వాళ్ల ఆలోచనల్ని అలవర్చుకుంటున్నట్టనిపిస్తోంది. నా గురించి నేను చెప్పుకోకూడదు- అయినా చెప్తాను- నేను తెలివైనవాడ్నే- నేను సీనియర్ గవర్నమెంట్ ఉద్యోగిని కదా! అంచేత నా భార్య చూచాయగా మన అమ్మాయి పెళ్లికి అవసరమైన కట్నం ఇవ్వలేని స్థితిలో వున్నాం మనం అంటే- అర్థం చేస్కోలేని స్థితిలో వున్నానా నేను? నేను ఇవ్వగలిగిన కట్నం అలకేశన్‌కిగాని, గిరీష్‌కికాని, కృష్ణన్‌కిగాని సరిపోలేదు. ఈ కట్నాలు పొయ్యడం అనే ఆచారం యీ దేశంలో వుండడానికి నేను బాధ్యుడ్ని కానుకదా!

కమల యీ షేర్స్‌లో మదుపులు పెట్టడానికి చూపిస్తున్న చొరవని, మంచి కుర్రాడ్ని ఎవడ్నైనా పెళ్లాడ్డంలో చూపించి వుంటే నేను బాగా సంతోషించి వుండేవాడ్ని- అప్పుడీ కట్నాల ప్రసంగాలు వుండేవికాదు. అయితే కమల పెళ్లాడి వుంటే కుర్రాడు మన కులంకి చెందినవాడు అయి వుండాలని కోరుకోడంలో తప్పులేదుకదా! ఏది ఏఁవయితేనేం, వీటన్నిటి గురించి యిప్పుడు మరి ఆలోచించి లాభంలేదు. ఎంచేతనంటే కమలకి యిప్పుడు బాగా వయస్సొచ్చేసింది. కమల చూడ్డానికి బాగానే వుంటుంది (వాళ్లమ్మ

పోలిక) కాని డబ్బు నగలు లేన్నాడు అందానికి విలువెక్కడుంది!

మా యింటికి దగ్గర్లోనే వున్న స్కూల్లో పని చేస్తోంది కమల. చక్కగా పనిచేస్తుందని పేరు తెచ్చుకుంది. దాంతో స్కూలు కమిటీలోను, సాంస్కృతిక కార్యక్రమాల్లోను కూడా మా అమ్మాయికి బాగా ప్రాముఖ్యం కల్పించారు. తన జీతంలో కొంత మొత్తం తన సొంత ఖర్చులకోసం వుంచేసుకోమని చెప్పేన్నేను. దీన్నిబట్టి మీరు గ్రహించే వుంటారు- నాకు పెద్దగా డబ్బు లేకపోయినా, ఉదారబుద్ధిలేని వాడ్ని మాత్రంకానని.

మా అబ్బాయి హరీష్ వున్నాడా- వాడు మరోరకం. అక్కలాగ కెరియర్‌ని అభివృద్ధి చేసుకునే ధోరణి పట్టుబడలేదు వాడికి. వాడికి గవర్నమెంట్‌లో ఉద్యోగం. వాడి స్నేహితుల్లో చాలామంది ప్రయివేటు సంస్థల్లో పనిచేస్తున్నారు. కొద్దిమంది వ్యాపారాల్లోకి దిగేరు. మా అబ్బాయి మాత్రం తన తండ్రి మార్గాన్నే అనుసరించాలని అనుకున్నాడో ఏమో, గవర్నమెంట్ ఉద్యోగంలో చేరేడు.

వాడికిప్పుడు యిరవైనాలుగేళ్లు. అంటే వాడికి పెళ్లి వయస్సొచ్చింది. మా పొరుగింటాయన ఓ గొప్ప సూచనచేశాడు. హరీష్‌కి పెద్ద కట్నం తెచ్చే అమ్మాయితోగాని పెళ్లి జరిపిస్తే, ఆ డబ్బులో కొంత భాగంతో మా చిన్నమ్మాయి రాధ పెళ్లి జరిపించేయవచ్చునని.

ఈ విషయం ప్రస్తావించినప్పుడు రాధ గురించి చెప్పాలి. మా రెండో అమ్మాయి రాధ పోస్టుగ్రాడ్యుయేషన్ చేస్తోంది, ఎకనామిక్స్‌లో. కమలంత తెలివైంది కాకపోయినా, కమలకంటే అందంగా వుంటుంది (మా అమ్మ పోలిక) రాధ కబుర్ల పోగు. పైగా చాలా నిక్కచ్చి మనిషి. ఆమె ఆడే మాటలు బోధపర్చుకోడం నాతరం కావడంలేదు. నాకు దాని మాటలు బోధపడ్డం లేదన్న సంగతి దానికి మాత్రం తెలియకండా జాగ్రత్తపడుతున్నాను. రాధ "Passive smoking, Women Activists, gender steretypes, women's movements" లాంటి మాటల్ని వాడుతుంటే, అవన్నీ నాకు అర్థం అవుతున్నట్టే నటిస్తుంటాను. హైస్కూలు గ్రామరు క్లాసుల్లో Active, Passive, gender అన్నవి చెప్తుండడం నాకు తెలుసు. ఆ మాటలకిప్పుడు కొత్తకొత్త అర్థాలు వచ్చినట్టు నాకిప్పుడిప్పుడే తెలుస్తోంది. 'Women's Movement' అంటే వాళ్ల ఉద్దేశం ఏవిటో నాకు తెలుసు. ఇబ్బంది పెట్టకండా వున్నంతకాలం, లేకపోతే ఇంటి ఖర్చుల వివరాలకే పరిమితమైనంతకాలం- ఈ ఉద్యమం విషయంలో నాకే అభ్యంతరం లేదు.

రాధది అదో తరహా. ఫార్వర్డేకాదు- భయం లేని మనిషి కూడాను. అందుకే ఒక్కొక్కప్పుడు నేను భయపడిపోతూ వుంటాను. ఆమెకి కాబోయే భర్త యెలా ఈ పిల్లతో నెగ్గుకు వస్తాడూ అని. నేను ఫైళ్లని మెయింటెయిన్ చెయ్యకండా నిలుపు చేయించిన నిర్వాకం కూడా రాధదే.

అదెలా జరిగిందంటే- కమలకి ఎలాగూ

"హరీష్‌కి వివాహ ప్రతిపాదనలు" అన్న హెడ్డింగుతో ఫైలుని కూడా ప్రారంభించేను. ఫైలుకి కొత్త ప్రతిపాదనల కాగితాల్ని చేరుస్తున్నప్పుడల్లా నా భార్య సణుగుతూ వుండేదనుకోండి. డబ్బు ఎలా ఖర్చు చెయ్యాలి అన్నది కూడా నా సుదీర్ఘ అనుభవంలో ఒక భాగమే కదా!

పెళ్లి చెయ్యలేకపోయినాను కనక, రాధకేనా పెళ్లి చెయ్యడానికి గట్టి ప్రయత్నం చెయ్యాలని నా ఉద్దేశం. ఆడపిల్లల అందం చందం ఇంకా వసివాడకముందే వాళ్లకి పెళ్లిళ్లు చేసేస్తే బావుంటుంది. ఈ ఉద్దేశంతోనే నేను పెళ్లి సంబంధాల వాకబు చెయ్యడం ప్రారంభించేను. "హరీష్‌కి వివాహ ప్రతిపాదనలు" అన్న హెడ్డింగుతో ఫైలుని కూడా ప్రారంభించేను. ఫైలుకి కొత్త ప్రతిపాదనల కాగితాల్ని చేరుస్తున్నప్పుడల్లా నా భార్య సణుగుతూ వుండేదనుకోండి. డబ్బు ఎలా ఖర్చు చెయ్యాలి అన్నది కూడా నా సుదీర్ఘ అనుభవంలో ఒక భాగమే కదా! అందుకని డబ్బంటూచేతికందితే, అందులో ఎంత భాగం హరీష్‌కీ వాడి కాబోయే భార్యకీ కేటాయించాలీ, ఎంత మొత్తం రాధ పెళ్లికి కేటాయించాలీ, ఎంత డబ్బు పెళ్లి ఖర్చుల కోసం అట్టేపెట్టాలి ఇత్యాది వివరాలు స్పష్టంగా నా మనసులో రూపుదిద్దుకొని వున్నాయి. ఇవన్నీ చాలా ముఖ్యమైన విషయాలని ఎవరేనా అంగీకరిస్తారు. అయితే, వంటింట్లో గొడవ లేవదీస్తుండడం మినహాయించి, ఈ విషయంలో నా భార్య సహాయం నాకేమాత్రం లభించడంలేదు.

మరి మా అబ్బాయి మాటో? నేను చేస్తున్న ప్రయత్నాలకి కృతజ్ఞత చూపించవలసింది పోయి, పెళ్లికూతుళ్ల ఫోటోలను ఓమారు అలా చూసి పడేసేవాడు తనకాసక్తి ఏమాత్రం లేదన్నట్టు, చూసిచూసి 'నీ వుద్దేశఁవేవిటి?' అనడిగేను. "అధంత ముఖ్యమా?" అని సమాధానం యిచ్చేడు.

వాడస్సలు నాకు అంతుబట్టడంలేదు. మీరు నమ్మరుగాని- నాకు మా అమ్మాయిలతో మాట్లాడ్డమే సులువనిపిస్తోంది- వాడితో మాట్లాడటంకంటే. అయితే, వాడిని అర్థం చేస్కోడంలో నా భార్యకి ఏ సమస్యలు ఎదురవుతున్నట్లు లేదు.

"వాడికి పెళ్లి చేస్కోడం ఇష్టంలేదా?" అనడిగాను నా భార్యని.


"ఎందుకిష్టంలేదూ? ఎటొచ్చీ, మీ పద్ధతులే వాడికి నచ్చడంలేదు- అంతే" అని ఆవిడ సమాధానం ఇచ్చింది.

"వాడి ఉద్దేశం ఏమిటి?" అనడిగేను ఆశ్చర్యపోతూ.

"వాడు పెళ్లి చేసుకుంటే, రాధ పెళ్లికి కావలసిన కట్నం వొస్తుందని మీరు ఆశపడుతున్న సంగతిని వాడు గ్రహించేశాడు. మిమ్మల్ని సంతోషపెట్టాలని వాడికి లేకపోలేదు. కాని మీ ఉద్దేశాన్ని మాత్రం వాడు హర్షించలేకపోతున్నాడు"

"అలా అయితే ఆ మాటని నాతోనే ఎందుకు చెప్పడంలేదు?" అన్నాన్నేను మనసులో విలవిల్లాడుతూ. "ఇలాంటివి ఎవరేనా వింటే ఏమనుకుంటారు? నేనేదో పిల్లల్ని సతాయించే పాతకాలం తండ్రిననుకోరూ?"





"అబ్బెబ్బే, మీరు సతాయిస్తున్నారని వాళ్లను కోడంలేదు- ఎటొచ్చీ వాళ్లేం చెయ్యాలన్నది మీరే నిర్ణయిస్తుంటారని వాళ్ల ఉద్దేశం"

"అందులో తప్పేముంది?" అన్నాను కాస్త తీవ్ర స్వరంతో. "నాకనుభవం వుంది- వాళ్లకి లేదు. అంచేత వాళ్లకి సలహా ఇవ్వాలనుకోవడంలో తప్పేముంది?"

"పోనీండి, దాన్నక్కడ వదిలేసి, హరీష్ ఏం చెయ్యాలనుకుంటున్నాడో ఎప్పుడేనా అడిగి చూశారా?"

నేను ఆశ్చర్యపోయాను. నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను. నాది తప్పేకావచ్చు- కాని నేనేం రాక్షసుడ్ని కానే! నాలో చిన్నచిన్న లోపాల్లేకపోలేదు. అయినా నా తప్పుల్ని ఎవరేనా వేలెత్తి చూపిస్తే నాకు కోపం రాదూ! ఇప్పుడదే జరిగింది.

"నేనెందుకడగాలి? వాడే నాతో ఎందుకు చెప్పకూడదు?" అని కోపంగా అడిగేను. దాంతో నా భార్య కూడా కోపం తెచ్చుకుంది- అదీ ఆశ్చర్యం.

"ఎవరిది తప్పు అని ఇప్పుడు పంచాయితీ జరిపించనక్కర్లేదు. అదెప్పుడో చాలాకాలం కిందట చేసి వుండవలసిన పని" అని తీవ్ర స్వరంతో సమాధానం చెప్పింది.

"ఈ సంగతే ఆలోచించరాదూ, వాడు స్కూలు చదువు చదువుతున్నప్పటి సంగతి. వాడు క్లాసులో బాగా వెనకపడి వుండేవాడు. అప్పుడు మీరేం చేసేవారు? కమలని చూపించి, ఆడపిల్లయినా ఎంత మంచి మార్కులు తెచ్చుకుంటోందో చూడ్రా అని వాడిని ఎద్దేవా చేస్తుండేవారు. నేను పదేపదే చెపుతూనే వుండేదాన్ని, పిల్లల్ని ఒకరితో ఒకర్ని సరిపోల్చకండీ అని. మీరు ఎప్పుడేనా వినిపించుకుంటేనా?" ఆమె గొంతు అలా అలా పెరిగిపోతోంది. అలాంటప్పుడు ఎవరో ఒకరు మౌనం వహించాలి కదా!

'కానీయ్' అన్నాను ప్రశాంతంగా.

"వాడి చిన్నతనంలో నాకు వంట పనిలో సాయపడుతూండేవాడు. ఎన్నిసార్లు వాడ్ని చూసి మీరు నవ్వేరో గుర్తుతెచ్చుకోండి- ఆడవాళ్లు చేసే పన్లు చేస్తున్నావని ఆక్షేపిస్తూ. పెద్దపెద్ద వూళ్లల్లో ఏ హోటలుకేనా వెళ్లి చూడండి అక్కడ పెద్ద వంటవాళ్లంతా మగాళ్లే. అయితే మీ కొడుకు దగ్గరకొచ్చేటప్పటికి వంటపని మీకు నామోషీ అనిపించింది. ఎంచేతట? మీ మనసులో వాడు ఏంచేస్తే బాగుంటుంది అన్న విషయం మీద ఓ ఫైలు రడీ చేసిపెట్టుకున్నారు. దాన్ని వాడు తు.చ. తప్పకుండా అమలుపర్చాలని మీ వుద్దేశం. అందుకే వాడు కేటరింగ్ కాలేజీలో చేర్తానన్నప్పుడు మీరంత గొడవ చేశారు."

"ఏఁవిటీ, వాడు నిజంగా సీరియస్‌గానే అన్నాడా ఆ మాట?" అన్నాను ఆవిడ మాటలకి అడ్డువస్తూ. నిజంగా నేను నిశ్చేష్టుడ్నయిపోయాను నా మీద వచ్చిన అభియోగానికి.

"మన కుటుంబంలో ఏనాడూ ఎవరూ అలాటి పనుల్లోకి దిగలేదు- ప్రతివాడూ గవర్నమెంట్ ఉద్యోగాలే చేశారు. నువ్విలాటి కోర్సులో చేరితే నలుగురూ ఏవంటారు- అంచేత నువ్వు కూడా యూనివర్సిటీ డిగ్రీ సంపాయించి తీరాలి అని మీరు వాడితో అన్నారాలేదా?"

ఆయాసం వచ్చి కాబోలు కాసేపాగింది నా భార్య. నా నోటంట మాట రావడంలేదు. నేనంటే ఎంతో అభిమానపడి, నా దగ్గర ఎంతో అణకువగా వుండే నా భార్యేనా ఈవిడ? నన్ను నేను సమర్థించుకోడానికి ఏమనాలా అని ఆలోచిస్తున్నాను- మళ్లీ ఈలోగా అందుకుంది నా భార్య.

"అంచేత హరీష్ ఎప్పుడూ మిమ్మల్ని మెప్పించాలని, మీరు పెట్టుకున్న ఆశలకి అనుగుణంగా ప్రవర్తించాలని ప్రయత్నిస్తున్నాడంటే ఆశ్చర్యమేమైనావుందా? కాని పెళ్లి విషయంలో మీ వుద్దేశాలేవీ వాడికి నచ్చడంలేదు. తన పెళ్లికి వచ్చే డబ్బులోంచి మీరు రాధకి కట్నం ఇవ్వాలనుకుంటున్న సంగతి కూడా వాడికి తెలుసు."

"వాడి సంగతి వాడు మాట్లాడలేడా అని అంటున్నాను?" అన్నాను నేను కోపంగా.

"మీరు వింటారా?" అని ఎదురుప్రశ్న వేసిందావిడ.

దాంతో నాకు పెనుకోపం వచ్చేసింది.

"నేనేవీ రాక్షసుడ్ననుకుంటున్నారా మీరంతా? తప్పకుండా వింటాను చెప్తే" అని పెద్ద కేకవేసి మరీ చెప్పాను.

"మీరు వింటారు- కాని అదేమీ పట్టించుకోరు- అదే తమాషా" అని పుల్లవిరుపుగా అనేసి, నాకాఫీ కప్పుని అందుకొని బయటికి వెళ్లిపోయింది. నేను నిజంగా బాధపడ్డాను. కమల విషయంలో తప్పుచేశాననే బాధ పీడిస్తుండడం చాలనట్టు, యిప్పుడు కొడుకు అభిప్రాయాల్ని కాదంటున్నాననే మరో అపరాధం జతయింది. కేటరింగ్ కాలేజట! చూడండెలా వుందో? పోనీ, రాధగాని ఆ కేటరింగ్ కోర్స్ చేస్తానంటే, అభ్యంతరపెట్టేవాడ్ని కాదే! ఆడపిల్లకి వంటచెయ్యడం మంచి అలంకారం. కాని కుర్రాడికా వంటల కోర్స్? అబ్బే, అదెలా కుదురుతుందీ! పైగా వాడు నా వారసుడాయె!"

ఆడవాళ్ల కంటబడకుండా దేన్నేనా దాచడం ఎంత కష్టవో మీరెరుగుదురా? ఇది రాధ విషయంలో మరీ ఎక్కువగా వర్తిస్తుంది. నా భార్యతో గొడవ జరిగిన మర్నాడు రాధ నా దగ్గరకొచ్చి "ఏఁవిటి నాన్నా, నేను విన్నది నిజమేనా- హరీష్ విషయంలో కూడా మీరేదో ఫైలు తయారుచేసి పెట్టుకున్నారట?"

"నీకెందుకమ్మా ఆ విషయాలన్నీ" అనేశాను.

తన ఎత్తుగడల్ని మార్చి, నేరుగా నన్ను ఎదుర్కోడం మొదలెట్టింది.

"వాళ్లల్లో ఏ అమ్మాయి హరీష్‌కి బావుంటుందని మీ వుద్దేశం నాన్నా? మూడోపేజీలోని అమ్మాయా, ఎనిమిదో పేజీలోదా, ఆరోపేజీలోదా?" అనడిగింది.

నేను తడబడ్డాను- రాధ దూకుడు చూసి. ఫైలు విషయం ఎలా తెలిసిపోయింది చెప్మా దీనికి? అప్పుడు గుర్తొచ్చింది నాకు- లాకర్‌లో దాని ఫైల్సు కూడా ఏవో కొన్ని వున్నాయని. ఫైళ్ల విషయంలో రాధ నా పద్ధతే ఫాలో అవుతున్నందుకు నాకు గర్వంగానే వుంది. అయితే ఆ ఫైళ్లలో దేశంలో వున్న బిజినెస్ స్కూళ్లకి పెట్టిన అప్లికేషన్లే వున్నాయి.

సరే యేదియేమైనాగాని, హరీష్ విషయంలో యిలాంటి ప్రశ్నలు వెయ్యడంలో దాని వుద్దేశం ఏఁవిటి చెప్మా?

దానికంటే తెలివిగా మాట్లాడాలని నిశ్చయించుకొని "ముందు నీ అమూల్యమయిన అభిప్రాయం శలవియ్యి" అన్నాను వ్యంగ్యంగా.

సమాధానం యివ్వడానికి తీరుబడిగా నా ముందే మఠంవేసి కూర్చుంది.

"మీరా చాలా అందంగా వుంటుంది.

దానికంటే తెలివిగా మాట్లాడాలని నిశ్చయించుకొని "ముందు నీ అమూల్యమైన అభిప్రాయం శలవియ్యి" అన్నాను వ్యంగ్యంగా.
సమాధానం యివ్వడానికి తీరుబడిగా నాముందే మఠంవేసి కూర్చుంది.
"మీరా చాలా అందంగా వుంటుంది. మూడో పేజీలోని అమ్మాయన్నమాట... అయితే ఆరోపేజీలోని లలితకి మంచి డిగ్రీ వుంది. ఈవిడ్ని ఆ పేజీలో సబ్‌సెక్షన్-ఎ కింద ఎందుకు చేర్చకూడదు?" అంది నాకంటె వ్యంగ్యంగా.

మూడోపేజీలోని అమ్మాయన్నమాట... అయితే ఆరోపేజీలోని లలితకి మంచి డిగ్రీ వుంది. ఈవిడ్ని ఆ పేజీలో సబ్‌సెక్షన్-ఎ కింద ఎందుకు చేర్చకూడదు?" అంది నాకంటె వ్యంగ్యంగా.

అనుమానంగా చూశాను- నన్ను ఎద్దేవా చేస్తోందా?

"ఆఁ అసలు సంగతి మర్చేపోయాను- ఆమె ఫైలు మూడు కాపీలు తయారుచెయ్యడం మరిచిపోయారు మీరు. కాని ఎనిమిదో పేజీలో వున్న మాలతి అందరికంటే పెద్దకట్నం తెస్తోంది. కురూపికదూ- అందుకని కాబోలు".

"ఆ అమ్మాయేం కురూపికాదు- సంసార పక్షంగా వుంటుంది"

"మాటలగారడీ!" అంది రాధ (ఎలాటి మాటలు వాడుతోందీ!) ఆమె వాడే కొన్ని మాటలకయితే అర్థాలకోసం నిఘంటువులు తిరగెయ్యాల్సిందే. నేను సిగ్గు పడవలసిన మాటలేవీ వుపయోగించకూడదని కోరుకుంటున్నాను. చెప్పలేం ఏరోజేం జరుగుతుందో- రోజులలా వున్నాయి!)

నా భార్య నవ్వుతూ ఓ చెణుకు విసిరింది "ఆ ఫైలు మీద closed అని రాసేయండి. లేకపోతే కేటరింగు కాలేజీల మీద ఓ ఫైలు తయారుచెయ్యండి. వాటికి అప్లయ్ చేయడానికి హరీష్ మీ అనుమతి అడగవచ్చు."



"నీ వుద్దేశం ఏమిటి నాన్నా? అందచందాల గురించి పెద్ద పట్టించుకోనక్కర్లేదనా? అవున్లే- మాలతి తెచ్చే కట్నం డబ్బుతో కమలకి పెళ్లి చెయ్యొచ్చని నీ వూహ!"

అనాలోచితంగా నేనో పెద్ద తప్పుచేసేసేను- పుసుక్కున నోరుజారి.

"అబ్బెబ్బే కమలక్కాదు- నీకు" అనేశాను.

ఆ తరవాత ఏంజరిగిందో చెప్పడానికి నేను యిష్టపడ్డం లేదు. మా చిన్నమ్మాయి నన్ను దులిపేయడం మొదలెట్టింది. (అక్కా, అన్నల్లా కాదిది- చాలా ధైర్యంవయిన పిల్ల).

నేనేదో యిలాటి ఎత్తుగడ మీద వున్నానని తను ఎప్పుడో పసిగట్టిందట. తన పెళ్లి మాట ఎత్తడానికి వీల్లేదంది. ఎందుకనో వివరిస్తూ బోలెడు కారణాలు చెప్పింది (1) అది ఇంకా చదువుకోవాలిట. (2) ఉద్యోగం సంపాదించుకోవాలన్నదే తన ధ్యేయంట. (3) అక్కకి పెళ్లి కాకపోతే తనూ పెళ్లిచేసుకోదట. (4) కట్నాలు తీస్కోడం చట్ట వ్యతిరేకచర్య అని నాకు తెలీదా?

అదికాకపోయినా మరో అమ్మాయి తెచ్చే డబ్బుని తీస్కోడానికి సిగ్గువెయ్యదా మీకు అనడిగింది. సొంత కొడుకుని అమ్మకానికి పెట్టానని ఆరోపణ వేసింది.

మురుగా, మురుగా- యీ కాలపు ఆడపిల్లల్తో ఎలా వేగడం? ఈ స్త్రీవాదుల వల్లే యిలాటి అనర్థాలు దాపురిస్తున్నాయి. వీళ్లందర్నీ కట్టకట్టి బంగాళాఖాతంలోకి విసిరేస్తే బాగుండ్ను. రాధతో అనేశాను. మరి వూర్కోలేక- ఈ రోజుల్లో ఆడపిల్లలు మరీ బరితెగిస్తున్నారని.

ఇలా బోలడన్ని రోజులవరకూ ఆలోచించుకోడానికి సరిపడినంత రభస జరిగింది.

ఇంతలో ఓ సంఘటన జరిగింది. ఓనాడు కమల వచ్చి నవ్వుతూ, స్టాక్‌ఎక్స్ఛేంజిలో తనకి బోలెడు డబ్బొచ్చిందని చెప్పింది. నిజంగా నమ్మగలంవంటారా? ఎంతొచ్చిందని నేనడిగితే, వ్యంగ్యంగా మాట్లాడ్డానికి దానికెంత ధైర్యం వచ్చిందంటే, "కట్నానికి సరిపడేంత రాలేదు నాన్నా-కాని వయోజనవిద్యా కార్యక్రమానికి తరగతులు నడపడానికి కావలసినంత వచ్చింది" అంది.

ఆమె వ్యంగ్యాన్ని పట్టించుకోనట్టు నటిస్తూ "నిన్ను చూస్తుంటే నాకు చాలా గర్వంగా వుందమ్మాయి" అన్నాను.

త్వరలోనే రెండో షాక్ తగిలింది. రాధ ఏమందో తెలుసునా? నా కొడుకుని వేలంలో అతి ఎక్కువ పాటపాడినవాళ్లకి అమ్మాలని చూస్తున్నాను కాబట్టి, ఆ వొచ్చే డబ్బుని నన్నే అట్టే పెట్టుకోమంది. ఆ డబ్బుతో తనకేమీ జరగడానికి వీల్లేదంది.

"నీ మాటల్తో ఏదో ఒరోజున నాకు హార్ట్ ఎటాక్ వచ్చి తీరుతుందే" అన్నాను చాలా నిష్ఠూరంగా.

"ఇదిగో నాన్నా, Emotional Black mailకి దిగొద్దు" అంది. చెప్పేనుకదా దాని మాటలు ఎలా వుంటున్నాయో!

చివరి దెబ్బ కూడా తగిలింది. రాధ తొందర్లో పెళ్లి చేసుకునే వుద్దేశంలో లేదని తెలిసేక హరీష్ కూడా నా పెళ్లికిప్పుడేం తొందర అంటున్నాట్ట.

"నేను అంతలా శ్రమపడి ఫైలు తయారు చేస్తే- యిప్పుడివేం మాటలు?" అన్నాన్నేను వుడుకుమోత్తనంతో.

నా భార్య నవ్వుతూ ఓ చెణుకు విసిరింది "ఆ ఫైలు మీద closed అని రాసేయండి. లేకపోతే కేటరింగు కాలేజీల మీద ఓ ఫైలు తయారుచెయ్యండి. వాటికి అప్లయ్ చేయడానికి హరీష్ మీ అనుమతి అడగవచ్చు."

"కనీసం ఒకరేనా ప్రోపర్ ఛానల్ ద్వారా వెళ్లి, పర్మిషన్ అడగాలనుకుంటున్నందుకు సంతోషం" అన్నాను నిష్ఠురం ధ్వనిస్తున్న గొంతుతో. వంటింట్లోంచి ముసిముసి నవ్వులు వినబడుతున్నాయి.

"ఏ విషయంలోనూ నన్ను సంప్రదించవలసిన అవసరంలేదని భావిస్తున్నట్లున్నారు ఈ పిల్లలు" అన్నాను తెగ బాధపడిపోతూ.

"ఎందుకు సంప్రదించరంటే మీరు ప్రతి దానికీ వీల్లేదు అని అంటారు కాబట్టి" అంది నా భార్య.

"హరీష్ అడిగితే సరేననాల్సిందేమో!" అన్నాను గుర్రుగా.

ఆ తరవాత వాడికి నిజంగానే పర్మిషన్ యిచ్చేను. వాడు వంటలకాలేజీలకి వెళ్లడం వల్ల ఓ సౌలభ్యం వుంది. ఎప్పుడేనా నా భార్య తన అక్కచెల్లెల్ని చూడ్డానికి వెడితే, రిఫ్రిజిరేటర్లో పెట్టిన పాచి వంటలు తినవలసిన అవసరం వుండదు. ●

## స్వభానులో అప్పు ఎప్పుడు చేయొచ్చు? ఎప్పుడు తీర్చవచ్చు?

### ద్విపుష్కర త్రిపుష్కర యోగాలు

కాలాన్ని అనుసరించి పనులు చేయాలని శాస్త్ర వచనం. కొన్ని సమయాలలో కొన్ని పనులు చేయరాదు. కొన్ని సమయాల్లో కొన్ని పనులు చేస్తే మంచి ఫలితాలనిస్తాయి. ఉదాహరణకు జ్యోతిశ్శాస్త్రంలో ద్విపుష్కర త్రిపుష్కర అనే యోగాలున్నాయి. ఈ యోగాలు ఏర్పడిన రోజుల్లో ఏ పనిచేసిన అవి తిరిగి మరలా చేయవలసి వస్తుంది. ఉదాహరణకు అప్పు ఇవ్వడం, పుచ్చుకోవడం, మందులు వాడడం వంటి పనులు తరచుగా చేయువలసి వస్తుంది. మనచేతిలో లేని విషయాలను పక్కనపెడితే మనకు అందుబాటులో ఉన్న అప్పులు ఇవ్వడం, తిరిగి పుచ్చుకోవడం మొదలైనవి పునరావృతం అయితే అంటే మళ్ళీమళ్ళీ చేయవలసివస్తే కష్టంకదా! అందుకని ఇప్పుడు తెలియచేయబోయే రోజులలో ఆ పనులు చేయకుండా ఉంటే మంచిది. అయితే దానాలు, పుణ్యకార్యాల వంటి ఇష్టపూర్వకంగా ఇచ్చేవి తప్ప మిగిలినవి చేయకుండా జాగ్రత్తపడవచ్చు.

ద్విపుష్కరయోగాలు ఏర్పడే రోజులు-
జులై 26, నవంబర్ 30

ఫలితం ఈరోజుల్లో పైన పేర్కొన్న కార్యక్రమాలు ఏవి జరిగినా తిరిగి జరుగుతాయి.

త్రిపుష్కర యోగాలు ఏర్పడే రోజులు- మే 3, జూన్ 21, జులై 6, ఆగస్టు 24, సెప్టెంబర్ 7, జనవరి 4, ఫిబ్రవరి 22 తేదీలు.

పై రోజుల్లో ఏ కార్యక్రమాలు జరిగినా అవి మూడుసార్లు జరుగుతాయి. తిరిగి చేయకూడదు అనుకునే అప్పులు ఇవ్వడం, పుచ్చుకోవడం మందులు వాడడం వంటివి చేస్తే ఆ కార్యక్రమాలు తిరిగి చేయవలసి వస్తుంది. ఈ రోజుల్లో దానధర్మాలు చేయవచ్చు. అవసరం కాదు అనుకుంటే మందులు కూడా వాడకుండా ఉంటే మంచిది. ఆపరేషన్లు చేయించకుండా ఉంటే మంచిది. ఎందుకంటే ఇవి తిరిగి పునరావృతం అయితే ఇబ్బందికదా! అయితే అప్పులు తీరిస్తే అది తిరిగి చేయడం వల్ల అప్పు తగ్గుతుంది.

అదేవిధంగా అప్పు చేయడానికి సోమవారం మంచిది. పై తేదీలు కాని మంగళవారాలు అప్పు తీర్చడానికి మంచిది. బుధవారం అప్పు ఇవ్వడం, తీర్చడం మంచిదికాదు.

అప్పు ఇస్తే వసూలు కావడానికి ఇబ్బంది కలిగించే నక్షత్రాలు ఉత్తర, ఉత్తరాభాద్ర, ఉత్తరాషాఢ, పుబ్బ, పూర్వాషాఢ, పూర్వాభాద్ర, విశాఖ, రోహిణి, కృత్తిక, మఖ, ఆరుద్ర, భరణి, ఆశ్లేష, మూల, జ్యేష్ఠ, స్వాతి. వీటిని గుర్తుంచుకుని పనులు చేయడం ద్వారా సుఖాన్ని, మానసిక శాంతిని పొందవచ్చు.

– డా॥ ఆమంచి బాలసుధాకరశాస్త్రి